జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త

తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 25-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 139 పేజీలు: 4 వెల : రూ.7



# ఇల్లీగల్ ఫైనాన్స్ దందా..!

**కాకీ ధరించిన వడ్డీ వ్యాపారస్తులు**
**పోలీసులు బినామీలే వడ్డీ వ్యాపారులు**
**రూ.5 నుండి రూ.10ల వరకు వడ్డీ వ్యాపారం**
**రోజువారీ ఫైనాన్స్ మొదలుకొని వారపు ఫైనాన్స్ దందా**
**ఫైనాన్స్ ఊబిలో మునిగి కొట్టుమిట్టాడుతున్న సామాన్యులు**
**యాప్ లోన్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వ్యాపారులు**
**దృష్టిసారించాలని ఎస్పీని కోరుతున్న బాధితులు**

శ్రీకాకుళం, అక్టోబర్ 24 (వార్త): శ్రీకాకుళం పట్టణం మొదలుకొని మండలం మొత్తం ఫైనాన్స్ ఊబిలో కూరుకుపోయి తల్లడిల్లుతున్న తీరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది.. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ శ్రీకాకుళం జిల్లా పై దృష్టి సారించి అక్రమ వడ్డీ వ్యాపారాలు చేస్తున్న వారి భరతం పట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో కూడా పోలీస్ వారు ప్రత్యేక డ్రైవ్ నిర్వంచి అక్రమ వడ్డీ వ్యాపారులు, చిట్ ఫండ్ వ్యాపారుల వివరాలు సేకరించి ఇళ్లు, కార్యాలయాలపై ఆకస్మిక సోదాలు నిర్వహించి పత్రాలను సేకరించి కేసులు నమోదు చేశారనిస్థానిక ప్రజలు అంటున్నారు. ఈ క్రమంలో కొంత అదుపులోకి వచ్చిందని, తిరిగి యథా స్థితికన్నా అధికమైందని, పోలీస్ వారు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరం ఉన్నా లేకపోయినా ఫైనాన్స్ యాప్ల వారు సెల్ ఫోన్ లకు నోటిఫికేషన్లు పంపించి సామాన్యులను ఆకట్టుకుంటూ బురిడీ కొట్టించి వారికి లోన్లు ఇస్తారు. అదేవిధంగా చిరువ్యాపారం చేసుకునే వారిని కూడా ఆకట్టు కుంటూ లోన్లుఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. యాప్ లోన్లతో పాటు ఆంధ్రా వ్యాపారులు, స్థానిక వ్యాపారులు కూడా తమదైన శైలిలో చిరువ్యాపారులను ఆకట్టుకుంటూ రోజు వారి ఫైనాన్స్, వారపు ఫైనాన్స్ పేరుతో జీరో దందాకు పాల్పడుతున్నారు. ఒక్కొక్క కస్టమర్ నుండి రూ 10 కిపైనే వడ్డీ వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల కన్నా ఎక్కువ పీల్చుకు తాగుతున్నారు. వ్యాపార అవసరం కోసం అలవాటు పడిన మధ్య తరగతి చిరు వ్యాపారులు ఉదయం నుండి రాత్రి వరకు కష్టపడి వచ్చిన సొమ్మతా వారికే ధారాదత్తం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సమయానికి కట్టకపోతే తిరిగి మరల అవసరానికి ఎక్కడ ఇవ్వరో అనే భయంతో ఈ అప్పు తీర్చడానికి మరో అప్పు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఈ దందాల బారిన పడిన వారిలో ఉద్యోగులూ బాధితులే..

ఉద్యోగస్తులు తక్కువేమీ కాదు. స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు టీచర్లు, ప్రైవేట్ ఉద్యోగులు, ఆర్టిజన్లు ఇలా అందరూ ఈ అధిక వడ్డీ వ్యాపారులకు బాధితులే. ఉద్యోగస్తులు అయితే వారి బ్యాంక్ చెక్ తో పాటు ప్రాంసరీ నోట్, వారి తోటి ఉద్యోగి చెక్ ప్రాంసరి నోట్ ఇవ్వాలి.. లేకపోతే అవసరానికి డబ్బులు రావు.. ఒకవేళ సమయానికి డబ్బులు చెల్లించకపోతే వెంటనే ఇరువురి పేరు మీద కోర్టులో వారు తీసుకున్న దానికన్నామూడు నుండి ఐదు రెట్లు అధికంగా వేసి వారిని కోర్టుకు ఈడ్చుతున్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక శ్రద్ద పెట్టీ ఇల్లీగల్ ఫైనాన్స్ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వం కూడా చిరు వ్యాపారులను గుర్తించి వారికి ఆర్థికబరోసా కల్పిస్తే ఇలా ప్రైవేట్ ఫైనాన్స్ రంగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అనేది కనిపిస్తోంది. ఒక్క పాన్ డబ్బా వ్యాపారి గురించే ఇంత ఉంటే పట్టణంలో చిరు వ్యాపారం చేసుకునే వారు మొదలుకొని కూరగాయల వ్యాపారులు రోడ్ల పక్కన తోపుడు బండ్ల వ్యాపారులు, డ్రైవర్లు, ఆటో నదుపుకునే వారు.. రిక్షా తొక్కే వారు, హమాలీలు, కూలి పనులకు వెళ్ళే వారు ఇలా అన్నిరంగాల పేదలు ఈ ఫైనాన్స్ వ్యాపారుల వలలో చిక్కుకొని కొట్టు మిట్టాడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ ఫైనాన్స్ దోపిడీ దారుల నుండి ప్ర జలను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యాంకింగ్ రంగం వారు కూడా చిన్న మధ్యతరగతి వారిని గుర్తించకుండా బడా బాబులకు కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేస్తున్నాయి. వారు తిరిగి చెల్లించ కుండా చట్టంలో ఉన్న లోసుగులతో బయట పడుతున్నారు. అదే పేద మధ్య తరగతి వారు తీసుకున్న అప్పు చెల్లించే వరకు తపన పడుతుంటారు. వారిని గుర్తించి ఆదుకొని ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవశ్యత ఉందని ప్రజలు కోరుతున్నారు.

## మదన గోపాలసాగరం ఎత్తిపోతల పథకం

# పునః ప్రారంభం

### మదన గోపాలసాగరం ఎత్తిపోతల పథకం పునః ప్రారంభం

### తేలినీలాపురానికి పూర్వ వైభవం తీసుకొస్తా

### రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు





శ్రీకాకుళం/టెక్కలి, అక్టోబర్ 24 (వార్త): తేలినీలాపురానికి పూర్వ వైభవం



తీసుకువచ్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి మండలం మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకంలో చోరీకి గురైన నాలుగు ట్రాన్స్ ఫార్మర్లు లను పునరుద్ధరించి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని గురువారం ఆయన పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు పథకాలకు సంబంధించి 11 ట్రాన్స్ ఫార్మర్లు విలువైన విడి భాగాలు చోరీకి గురవ్వగా, మరమ్మతులకు రూ.78.85 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఎ.బి.ల 4 ట్రాన్స్ ఫార్మర్లు పునరుద్ధరణకు రూ.31.02 లక్షలు ఖర్చు చేసి ఈ పథకాన్ని పున:ప్రారంభించినట్లు వివరించారు. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వలన రైతులు పలు ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ఎప్పుడు సంతృప్తిగా ఉంటారంటే పది మందికి ఉపయోగపడే పని ఎప్పుడు చేస్తారో అప్పుడే నాయకుడు సంతృప్తితో ఉంటారన్నారు. గత 40 ఏళ్ల నుండి మౌలిక సదుపాయాలు సమకూర్చినట్లు పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఉన్న రైతులు, కూలీలు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే వారని, వ్యవసాయానికి నీరు ఉండేది కాదని, 2014-19లో తాను మంత్రిగా ఉన్న సమయంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనిచేసిందన్నారు. అధికారం మారిన తర్వాత అధికారులను అడిగితే వివిధ రకాల సాకులు చెప్పేవారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా పలాసకు నీరు అందించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఫైలు తానే స్వయంగా తీసుకువెళ్లి రూ.78.58 లక్షలు మంజూరు చేయించుకున్నట్లు వెల్లడించారు. ఇందులో మదనగోపాలసాగరానికే రూ.31.02 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. శివారు ప్రాంతాలకు అందకపోతే రైతుల తన వద్దకు వచ్చి తెలియజేస్తే పలుమార్లు కలెక్టర్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. వంశధారలోకి వరద రావడంతో 2 వేల క్యూసెక్కుల నీరు చేరి రైతులకు ఇబ్బంది లేకుండా ఉందన్నారు. ప్రస్తుతం కూడా వర్షాలు పడతాయని నీరు వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మదనగోపాలసాగరం 5 పంచాయతీలకు నీరు ఇచ్చినట్లు చెప్పారు. శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదని, 3.50 కోట్ల రూపాయలతో ఎస్టిమేషన్లు వేయించి ప్రభుత్వం వద్ద మంజూరు చేయించుకొని నిదులు తీసుకువచ్చి పనులు చేయించి వచ్చే సిజన్ నాటికి అన్ని ప్రాంతాలకు నీరందిస్తానన్నారు.



అనంతరం టెక్కలిలో తాత్కాలిక గోశాలను ఆయన ప్రారంభించారు. టెక్కలిలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయో వాటిని పది రోజుల్లో గుర్తించాలని ఆర్డీఓకు ఆదేశించినట్లు చెప్పారు. ఆసుపత్రిలో ఏ భవనం అయితే బాగుందో అందులోకి మార్చేందుకు చర్యలు తీసుకోమని ఆర్డీఓకు ఆదేశించినట్లు స్పష్టం చేశారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని పూర్తి చేస్తామన్నారు. శాశ్వత భవనాలు నిర్మించే వరకు ఇక్కడే కొనసాగుతాయన్నారు. అన్ని కార్యాలయాలు దగ్గర దగ్గరగా ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఇక్కడ ఉండే ఉద్యాన వన శాఖ ఎడి కార్యాలయం పాడేరు తరలించారని, దానిని తిరిగి టెక్కలి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మరికొన్ని తరలించారని, జైలు ఇక్కడ ఉండేదని దానిని తరలించారని, దానిని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. రహదారులు విస్తరణ కూడా చేయాల్సి ఉందన్నారు. అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మెళియాపుట్టి నౌపడ రహదారి నుండి రావివలస ముఖద్వారం వరకు 2 కిలో మీటర్ల మేర రహదారి మరమ్మతులకు రూ.63 లక్షలుతో పనులకు శంకుస్థాపన చేశారు. త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తేలినీలాపురానికి రూ.1.95 కోట్లు మంజూరు చేయడమైనదని, వచ్చే పర్యటన తేలినీలాపురం వెళ్లి అక్కడ ఏ ఏ పనులు చేయాలి, ఏమి అవసరమో అవి చేపట్టి పర్యాటక ప్రాంతంగా పూర్వవైభవం వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, మదనగోపాలసాగరం ఈఈ కెవివి సుబ్రహ్మణ్యం, డిఈ ఎన్. కామరాజు, ఎఈఈ మదుసూదనరావు, ఇతర అధికారులు, పి. అజయ్ కుమార్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

---

# పంచారామాలకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం, అక్టోబర్ 24 (వార్త): శ్రీకాకుళం నుంచి ప్రతిష్టాత్మకమైన పంచారామాల దర్శనం కోసం ఆర్టీసీ స్పెషల్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్తీకమాసంలో శైవక్షేత్రాలు, పంచారామాలు, పిక్నిక్ స్పాట్‌లకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ తెలిపారు. అమరావతి అమరేశ్వరుడు, పాలకొల్లు క్షీరరామలింగేశ్వరుడు, భీమవరం సోమేశ్వరుడు, ద్రాక్షారామం భీమేశ్వరుడు, సామర్లకోట కుమార రామ భీమేశ్వరుడు పుణ్యక్షేత్రాలను దర్శించే వారి కోసం సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. నవంబర్ 3,10,17,24 తేదీల్లో సాయంత్రం 4 గంలకు శ్రీకాకుళం బస్సు కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. అనంతరం తిరిగి మంగళవారం తెల్లవారుజామున శ్రీకాకుళానికి చేరుకుంటాయన్నారు. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ రూ.2400, ఆల్ట్రా డీలక్స్ రూ.2350, ఎక్స్‌ప్రెస్ రూ.2000లు చార్జీ నిర్ణయించినట్టు తెలిపారు. టికెట్లను ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చున్నారు. అలాగే శబరిమళకు కూడా బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. వివరాలకు 9959225608, 7382921647 నెంబర్లను సంప్రదించాలని కోరారు.




# హైవే విస్తరణకు రూ.252.42 కోట్లు

### - జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం

### - ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ

### - రణస్థలం వద్ద 6 లైన్లతో జాతీయ రహదారి నిర్మాణానికి నిధుల కేటాయింపు



శ్రీకాకుళం, అక్టోబర్ 24 (వార్త): జిల్లా అభివృద్ధిలో కీలకమైన జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. నరసన్నపేట - శ్రీకాకుళం - విశాఖపట్నం మధ్య కీలకంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలించింది. ఈ మేరకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి-16 మార్గంలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి కార్యాలయం గురువారం విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఇందులో రాజధాని నగరం అమరావతి నుంచి రూ.2,245 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపగా... జిల్లాలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు సవరణలతో కూడిన కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా రూ.252.42 కోట్లు కేటాయిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.

తొలగిన అడ్డంకులు...

జాతీయ రహదారి - 16 లోని విశాఖపట్నం - శ్రీకాకుళం - నరసన్నపేట మధ్య 6 లైన్లతో 100 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని అప్పట్లో ఎంపీగా ఉన్న ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి, ప్రతిపాదనలు అందించారు. దీంతో రూ.3వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం%ొ% రణస్థలం మినహా మిగతా మార్గంలో నిర్మాణాలు పూర్తి చేసింది. 2014లో చేపట్టిన సర్వే ప్రకారమే భూములు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు దీనికి అంగీకరించలేదు. సమస్యను సవాల్ గా స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు%ొ% బాధ్యతలు స్వీకరించనప్పటి నుంచి కేబినెట్ లో పలుమార్లు ప్రస్తావిస్తూ వస్తున్నారు. తాజాగా కేంద్ర మంత్రిమండలి ఆమోదంతో ఏళ్లుగా పెండింగ్ లో ఉండిపోయిన ఈ నిర్మాణాలు... మళ్లీ పట్టాలెక్కనున్నాయి. దీనిపై ఢిల్లీ నుంచి రామ్మోహన్ నాయుడు స్పందించారు. జిల్లా ప్రగతి భాగమైన హైవేల విస్తరణకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్రమోదీ తోపాటు రోడ్డు, కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితన్ గడ్కరీకి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అమరావతిలో రూ.2,245 కోట్లతో రైల్వే లైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధిని ఈ సందర్భంగా ఆయన ప్రసంశించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగేశ్వరుడి హుండీ లెక్కింపు

**జలుమూరు, అక్టోబర్ 24(వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వర స్వామి వారి హుండీని గురువారం లెక్కించారు. ఆమదాలవలస గ్రూప్ ఆలయాల కార్యనిర్వహణ అధికారి టి.రవి సమక్షంలో ఈ లెక్కింపు జరిగింది. స్వామివారి హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ.2,02,758లు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభాకర్ తెలిపారు. 86 రోజులకు గాను ఈ ఆదాయం లభించిందన్నారు.







# ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

**-సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు**

**మందస, అక్టోబర్ 24(వార్త):** ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా వీవోఏలు కృషి చేయాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందసలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సద్వినియోగమయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా చూడాలన్నారు. ప్రతీ వీవోఏ, వీపీ ఒక గ్రూపు చొప్పున ఓపెన్ నెట్‌వర్క్ ఆఫ్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీసీ) గుర్తించాలన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను గుర్తించి, జెఎల్జీ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి వరకు మూడు గ్రూపులను ఏర్పాటు చేశామన్నారు. ఎంసీఎంఈ సీడ్ క్యాపిటల్, హెచ్ఏఈ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో గ్రానైట్ తవ్వకాలను నిలిపివేయాలి

**మందస, అక్టోబర్ 24(వార్త):** గిరిజన ప్రాంతాల్లో పర్యావరణాన్ని ధ్వంసం చేసే గ్రానైట్ తవ్వకాలను నిలిపివేయాలని శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు సర్పంచ్ సవర సుధాకర్, సవర నారాయణ, శాంతారావు, లక్ష్మణరావు, దశరథ, ఈశ్వరరావు, గున్నయ్య, ఢిల్లేశ్వరరావు, తులసీరావు, రమేష్ డిమాండ్ చేశారు. గురువారం వారు మందస తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజసిద్ధమైన అటవీ సంపద పరిరక్షణ, ఆదివాసీల హక్కులకు పోరాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి, ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు దానికి తగ్గ నియమ నిబంధనలు పాటించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయన్నారు. జిల్లాలో గ్రానైట్ లీజులు మరింత నష్టపరుస్తున్నాయని, లీజులు కేవలం గిరిజనుల గుండెల్లో గుబులు రేపడమే కాకుండా వన్యప్రాణులకు రక్షణ కరువై, జనారణ్యం లోకి వచ్చి తమ ప్రాణాలు విడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఊటీగా పేరొందిన జిల్లాలో సహజ వనరులను నాశనం చేస్తూ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. జిల్లాలోని టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, మందస, పాతపట్నం తదితర మండలాల గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ, జొన్నలు, రాగులు, కందులు, జీడి మామిడి పంటలను పండిస్తూ ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా జీవిస్తున్న ఆదివాసుల హక్కులను గ్రానైట్ తవ్వకాల పేరుతో హరించివేస్తున్నారన్నారు. అడవిని నరికి, కొండలను బాంబులతో పేల్చి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని, మందస, మండలం, కొండలోగాం పంచాయతీ పరిధిలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉందన్నారు. సహజ సిద్ధమైన, సహజ వనరులను, జంతు, జలాలు, పక్షులు, అడవి నాశనంతో పాటు వాతావరణం, దుమ్ము, ధూళి వర్ష ప్రభావం తగ్గి, కాలుష్యం పెరిగి.. రోడ్లు, పచ్చని పంట పొలాలు, జీడి మామిడి పంటలే కాకుండా ఇతర పంటలు కూడా నాశనం అయిపోతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదన్నారు. అక్రమార్కుల ఖజానా, అవినీతి అధికారుల జేబులు నింపడానికి సహజసిద్ధమైన సంపదను నాశనం చేస్తున్నారన్నారు. గ్రానైట్ తవ్వకాలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వం తక్షణమే వీటిపై సమగ్ర విచారణ జరిపించి, తవ్వకాలను నిలిపివేయాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిని అందజేస్తున్న శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు

### పోరాటాలకు సిద్ధం కండి

గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంత భూముల బదలాయింపు నియంత్రణ చట్టం 1/70, 1996 పెసా(పంచాయతీరాజ్) యాక్ట్ ప్రకారం గ్రామసభకే అధికారం ఉందన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ఆదివాసీల భద్రత కోసం అనేక చట్టాలు వచ్చినా, అవి అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు.

మైనింగ్ వంటి కార్యకలాపాలు చేపట్టడానికి వీలులేదని సుప్రీంకోర్టు సమతా కేసులో ఇచ్చిన తీర్పు ఆదివాసుల జీవన భద్రతకు సంబంధించి చాలా కీలకమైనదన్నారు. ఆదివాసులను అడవి నుంచి గెంటివేసి, అటవీ సంపద, అడవి గర్భంలోని గనులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగా మోదీ తీసుకొచ్చిన 2023 అటవీసంరక్షణ(సవరణ) చట్టం రద్దుకు పోరాడుదామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 24(వార్త) :** రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజిని ఆధ్వర్యంలో వీరికి అభినందన సభ గురువారం నిర్వహించారు. శ్రీకాకుళం లోని ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈనెల 20న జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో బాలికల విభాగం నుంచి భవాని, మీనా, గీత, ధనలక్ష్మి బాలుర విభాగం నుంచి హేమంత్, రవి దేవరాజు ఉన్నారు. వీరు ఈ నెల 25 నుంచి 27వరకు శ్రీకాళహస్తి వేదికగా జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.







## రాజ్యరాణి రైలు ఢీకొని రెండు ఆవుల మృతి

**పాతపట్నం, అక్టోబర్ 24(వార్త):** పాతపట్నం మండలం కాపు గోపాలపురం గ్రామ సమీపంలో గురువారం రాజ్యరాణి రైలు ఢీకొని, రెండు ఆవులు మృతి చెందాయి. మరో రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి.

## రూ 1.21 కోట్ల ఉపాధి నిధులకు ఆడిట్



**సారవకోట, అక్టోబర్ 24(వార్త):** సారవకోట మండలం అలుదు గ్రామంలో గురువారం రూ.1.21 కోట్ల ఉపాధి నిధులతో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఖర్చు చేసిన నిధులు వేతనదారుల ఖాతాలకు జమయ్యాయా..లేదా అని వేతనదారులను సంబంధిత సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధి పథకం ద్వారా జరిగిన పనులు, హాజరైన వేతనదారులు తదితర అంశాలపై సోషల్ ఆడిట్ సిబ్బంది ఆరా తీశారు.

## నాణ్యమైన విద్య, ఆహారాన్ని అందించండి



**జలుమూరు, అక్టోబర్ 24(వార్త):** ఎలమంచిలి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించామని హెచ్ఎం రఘునాథరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ విధి, విధానాలపైన అవగాహన కల్పించామన్నారు. మధ్యాహ్న భోజనం పనితీరును కమిటీతో పరిశీలించి పలు సూచనలు చేశారమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కమిటీ కోరిందన్నారు.

## 'ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి'

**జలుమూరు, అక్టోబర్ 24(వార్త):** జలుమూరు పీహెచ్‌సీ పరిధి దల్లప్పపేటలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సీహెచ్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన స్థానికులకు పరీక్షించి ఉచిత మందులను పంపిణీ చేశామన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్న రాజులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వంగర, అక్టోబర్ 24(వార్త):** వంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వంగర ఏఈ సాంబశివరావు గురువారం తెలిపారు. 11 కేవీ వంగర ఎంహెచ్ క్యూఫీడర్ నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల పరిధిలో గల విద్యుత్ పోల్స్ కిందన ఉన్న పెద్ద చెట్లు తదితరాలను తొలగించి, లైన్లు సరి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఓని అగ్రహారం, సంగాం, వంగర గ్రామాలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**జలుమూరు, అక్టోబర్ 24(వార్త):** అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్న నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన పొట్నూరు ప్రసాదరావుకు రూ.70,000లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



**జలుమూరు, అక్టోబర్ 24(వార్త):** తిలారు రైల్వే గేటు సమీపంలో ఓ యువ కుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ షరీఫ్ అందించిన సమాచారం మేరకు పోలాకి మండలం ఈదులవలస గ్రామానికి చెందిన కొర్ను శ్రీనివాసరావు (27) బుధవారం సాయంత్రం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించామన్నారు.

## అనురాగ నిలయంలో అన్నదానం



**శ్రీకాకుళం, అక్టోబర్ 24(వార్త):** శ్రీకాకుళంలోని శాంతా అనురాగ నిలయం, సీవీ నాగజ్యోతి ఆనంద నిలయంలో అన్నదానం గురువారం నిర్వహించారు. నైరా ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి జీవరత్నం ఒకటో వర్థంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు తర్లాడ అప్పలకాళీ శ్రీధర్, శ్రీకన్య దంపతులు, కుమార్తె, కుమారుడు సంజన, సిద్ధార్థ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పూసర్లపాడు మాజీ సర్పంచ్ అరవల పెద్దబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవరత్నం పేరు మీద నిరుపేదలకు, అనాథలకు తమ వంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది జరుపుతామన్నారు. ఆమె ఆశీస్సులు తమ కుటుంబ సభ్యులపై ఉండాలని ఆకాంక్షించి మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతామన్నారు.

## మిస్టర్ ఆంధ్రా పోటీలకు ఎంపిక

**శ్రీకాకుళం, అక్టోబర్ 24(వార్త):** విజయనగరంలో ఈనెల 27న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు మన జిల్లా నుంచి కొంతమంది బాడీబిల్డర్స్‌ను గురువారం గోపాల్ ఫిట్నెస్ జిమ్ములో ఎంపిక చేశారు. వీరిలో 55 కేజీల విభాగంలో పి.రాజేష్, ఆర్.హరీష్ (ఆమదాలవలస, ఏయూ జిమ్), 60 కేజీల విభాగంలో ఎం.రఫీ ఖాన్ (గోపాల్ ఫిట్‌నెస్ జిమ్), కె.సుమంత్, 65 కేజీల విభాగంలో డి.గణేష్, ఎన్.రాజు (ఆదిత్య జిమ్), 70కేజీల విభాగంలో ఆర్.గణేష్ (పలాస), ఎ.భాస్కరరావు మాస్టర్ ఎంపికయ్యారు. వీరికి గోపాల్ ఫిట్‌నెస్ అధినేత గోపాల్, శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా సెక్రటరీ వి.విజయకుమార్, టీం కోచ్ కె.గౌరీశంకర్(ఆమదాలవలస) ప్రత్యేక అభినందనలు తెలిపారు.








# మూలిపాడులో మూడు కల్వర్టుల నిర్మాణం

**-పంచాయతీ ప్రగతికి పెద్దపీట వేస్తున్న సర్పంచ్ వెంకటరావు**

**మందస, అక్టోబర్ 24(వార్త):** మందస మండలంలోని మూలిపాడు పంచాయతీ అభివృద్ధి పథాన దూసుకుపోతోంది. యువసర్పంచ్ గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఒకేసారి మూడు కల్వర్లును పంచాయతీలో నిర్మిస్తున్నారు. మూలిపాడు గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఒక కల్వర్టు, తెంబ భానుమతి ఇంటి వద్ద రెండవది, జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద మూడవ కల్వర్టు నిర్మిస్తున్నారు. కల్వర్టుల నిర్మాణాలను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.ప్రసన్న కుమార్, పంచాయతీ కార్యదర్శి జగదీష్ పర్యవేక్షించారు.

కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పిట్ట భీమా రావు, గుసిరి నాగేశ్వరరావు, తెలుకల దుదిష్టి, దట్టి కోదండరావు, కలిగాన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే సదస్సులు

**వంగర, అక్టోబర్ 24(వార్త):** రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి రీసర్వే జరిగిన గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి గంగాభవానీ తెలిపారు. గురువారం మద్దువలస గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సు నిర్వహించి రైతుల నుంచి భూ సర్వేలో జరిగిన మార్పులు, చేర్పులకు సంబంధించిన సవరణలు చేయడానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మండలంలోని ఆరు గ్రామాల్లో ఇంతవరకు రీసర్వే నిర్వహించామని, ఈనెల 25న వీవీఆర్ పేట, 26న బంగారువలస, 28న ఓనెఅగ్రహారం, 29న గీతనాపల్లి, 30న నీలయ్యవలస, నవంబరు 2న బాగింపేట, 4న జేకే గుమ్మడ, 5న తలగాం, 6న ఇరువాడ, 7న కొప్పరవలస, 8న లక్ష్మీంపేట, 11న చంద్రంపేట, 12న రుషింగి, 13న వంగర గ్రామ పంచాయతీలో ఈ గ్రామ సభలు జరగనున్నట్లు తెలిపారు. నవంబరు 14న మగ్గూరు, 15న దేవకివాడ, 16న కొట్టిశ, 17న నరేంద్రపురం గ్రామంలో రీ సర్వే రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఈ సర్వేలో జరిగిన కొన్ని మార్పులు చేర్పులకు సంబంధించిన వాటిని సవరించడానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.



కార్యక్రమంలో మండల సర్వే యర్ నాగేశ్వరరావు, రెవెన్యూ, సచివా లయ సిబ్బంది, రైతులు, గ్రామ నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**నరసన్నపేట, అక్టోబర్ 24(వార్త):** గతంలో జరిగిన సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను గుర్తించేందుకు నేరుగా రైతుల వద్దకే అధికారులు వస్తారని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. గురువారం నరసన్నపేట మండలం తోటాడ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా, వాటిని తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.





**సారవకోట:** గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వేలో భాగంగా సర్వే పూర్తయిన రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. గురువారం సారవకోట మండలం కొమ్ము సరియాపల్లి రెవెన్యూ గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో జరిగిన సర్వేలో కొన్ని లోటుపాట్లు ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. వాటిని సరి చేసేందుకే నేడు గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు.

**పోలాకి:** సమగ్ర భూ సర్వేలో భాగంగా చేపట్టిన సర్వేలో లోటుపాట్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు సర్వేయర్ పంగ వెంకటరమణ తెలిపారు. గురు వారం పోలాకి మండలం రాజపురం రెవెన్యూ గ్రామంలో గ్రామ సభను నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా గతంలో 132 మంది రైతుల భూము లను సర్వే చేశామని పేర్కొన్నారు. వాటిపై సమీక్షించి లోపాలను సరి దిద్దుతామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వైన్ షాప్ తొలగించాలని నేడు ఆందోళన

**వంగర, అక్టోబర్ 24(వార్త):** మద్దువలసలో నిబంధనలకు విరుద్ధంగా గ్రామానికి మధ్యలో వైన్ షాపు ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. దీనిని వెంటనే అక్కడి నుంచి తొలగించి, గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని వారు కోరారు. దీనిపై శుక్రవారం తాము ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. గ్రామానికి మధ్యలో వైన్ షాప్ ఉండడంతో ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని, వారు వాపోయారు.





# సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

## -టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు

**జలుమూరు, అక్టోబర్ 23(వార్త):** మండలం ఈదులవలస జి.ఎన్.ఆర్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన మండల తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. ఈనెల 26 నుంచి పార్టీ సభ్యత్వం ప్రారంభిస్తామని, తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అత్యంత సులభంగా చేసుకోవచ్చని, ప్రతి క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇన్చార్జి, ముఖ్య నాయకులు బాధ్యతగా తీసుకొని గ్రామాల్లో సభ్యత్వం నమోదు చురుకుగా చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో రాష్ట్రంలో నరసన్నపేట నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండాలన్నారు. ఎప్పటిలాగా 100 రూపాయలు చెల్లిస్తే సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఇన్సూరెన్స్ రెండు లక్షల నుంచి 5 లక్షల వరకు పార్టీ పెంచిందన్నారు. చనిపోయినకార్యకర్తలకు రూ.10,000 లు మట్టి ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షుడు మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరి భాస్కరరావు , జిల్లా లీగల్ సెల్ ప్రతినిధి రోణంకి కృష్ణంనాయు డు, మాజీ మండల ప్రెసిడెంట్ తమ్మి నాన భూషణ్, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిటీ ఇంచార్జిలు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# రావివలస రోడ్డుకు మంత్రి శంకుస్థాపన

**టెక్కలి, అక్టోబర్ 24(వార్త):** టెక్కలి నియోజకవర్గం రావివలసలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.63 లక్షల నిధులతో రహదారి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రావివలస మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మంచి నాణ్యతతో కూడిన ప్రసాదం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు వ్యాస రచన పోటీలు.

**శ్రీకాకుళం, అక్టోబర్ 24(వార్త):** పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు అరికట్టుటలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థి, విద్యార్థినులు వ్యాసరచన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో మంచి ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు.



# ఘనంగా ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం

**శ్రీకాకుళం, అక్టోబర్ 24(వార్త):** శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) "ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ" దినోత్సవాన్ని చరిత్ర, టూరిజం, పొలిటికల్ సైన్స్ విభాగం వారు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, మానవహక్కుల సమష్టి కృషికి ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య




సమితి అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి పి.శంకరనారాయణ మాట్లాడుతూ ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఏర్పడిన ఒక అంతర్జాతీయ సంస్థ 'ఐక్యరాజ్యసమితి' అన్నారు. చరిత్ర అధ్యాపకులు సీహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ యుద్ధ భావన మొదట నాయకుల మెదడులోనే పుడుతుందని, దానిని మనమంతా ఒక్కటే అన్న సమైక్యతా భావంతో తొలగించాలన్నారు. కార్యక్రమంలో "చరిత్ర,టూరిజం" శాఖాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఆర్.రామజోగినాయుడు డాక్టర్ కె.ప్రభాకర్, ఎస్.రుద్రమరాణి, ఎల్.కృష్ణారావు, విద్యార్థినులు పాల్గొన్నారుల

# మహిళా కళాశాలలో 'ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్'

**శ్రీకాకుళం, అక్టోబర్ 24(వార్త):** శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) నందు గురువారం "ఎంప్లాయ్మెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సూర్య సునీత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .కె. సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు డిగ్రీ పూర్తి అయిన వెంటనే ఉద్యోగం సంపాదించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాల ఆవశ్యకత ఎంతగానో ఉంటుందన్నారు. వారు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముఖ్య అతిథి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.సుధ మాట్లాడుతూ- ప్రతి విద్యార్థి పదో తరగతి పూర్తయిన వెంటనే, ఎంప్లాయ్మెంట్ కోసం 'స్టేట్ పోర్టల్', 'నేషనల్ కెరీర్ ఫర్ సర్వీసెస్' మొదలైన పోర్టల్స్‌లో తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని, ఒకవేళ సమయానికి చేసుకోకపోతే ఆరు నెలలు గ్రేస్ పీరియడ్ ఉంటుందన్నారు అప్పుడు కూడా రెన్యువల్ చేసుకోకపోతే మళ్లీ మొదటి నుంచి ప్రాసెస్ చేసుకోవాలని విద్యార్థినులకు తెలియజేశారు.

ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ వై.రవీంద్ర ఆయా పోర్టర్స్‌లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని విద్యార్థినులకు వివరించారు.

కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఎం.ఎన్. పాఠక్ (వై.పి), రసాయన శాస్త్ర అధ్యా పకులు ఎం.రోహిణి, సీహెచ్ చాందిని, ఎస్.గీత, పి.కీర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413